సాక్షి కర్నూలు

మంగళవారం ౹ 23 ౹ సెప్టెంబర్ ౹ 2025



మద్దతు ధరనే కావాలి!

ఎకరాకు రూ.20 వేలు వద్దే వద్దు.. మద్దతు ధరతోనే ఉల్లిని కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కర్నూలు మార్కెట్‌కు సోమవారం ఉల్లి తాకిడి తగ్గింది. IIలో▸



సామాజిక దృక్పథం అవసరం

వైద్యులకు సామాజిక దృక్పథం అవసరమని మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ అన్నారు. ఎంబీబీఎస్ ఫస్టియర్ విద్యార్థులతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. IIలో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,626.06
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:11,430
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:11,276

న్యూస్‌రీల్

శ్రీమఠంలో వైభవంగా దసరా ఉత్సవాలు ప్రారంభం



ఘట స్తంభాలకు హారతి పడుతున్న శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం రూరల్: శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో సోమవారం దసరా దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలను పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రారంభించారు. పూజా మందిరంలో రెండు ఘట స్తంభాలకు పుష్ప మాలంకరణతో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం గ్రామ దేవత మంచాలమ్మ సన్నిధిలో విరులాభిషేకం చేశారు. శాస్త్రోక్తంగా జరిగిన వేడుకలు భక్తులను ఆకట్టుకున్నాయి.

హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు భవనాల పరిశీలన



ప్రతిభా స్కూలులోని భవనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

కర్నూలు(సెంట్రల్): కర్నూలులో హైకోర్టుబెంచ్ ఏర్పాటుకు అవసరమైన భవనాలను కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి పరిశీలించారు. సోమవారం నగరంలోని మారుతి మెగా సిటీ సమీపంలో ఉన్న ప్రతిభా స్కూలు, నన్నూరు టోల్‌గేట్ దగ్గర ఉన్న ఎస్‌వీఈఎస్ ఒకేషనల్ కాలేజీ భవన సముదాయాలను ఆమె పరిశీలించారు. ఆయా భవనాల్లో కలియ తిరిగి ఎన్ని భవనాలు ఉన్నాయి, ఎంత విస్తీర్ణం తదితర వివరాలను యాజమాన్యాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట కర్నూలు ఆర్‌డీఓ సందీప్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ మహేశ్వరరెడ్డి ఉన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు



నూతన ఎస్‌ఈగా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రదీప్‌కుమార్

కర్నూలు(అగ్రికల్చర్): వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కలసికట్టుగా పనిచేద్దామని విద్యుత్ శాఖ(ఏపీఎస్‌పీడీసీఎల్) కర్నూలు సర్కిల్ (ఆపరేషన్) సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్‌ఈ) ఆర్.ప్రదీప్‌కుమార్ అన్నారు. సోమవారం ఏపీఎస్‌పీడీసీఎల్ కర్నూలు సర్కిల్ ఎస్‌ఈగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆ వెంటనే ఆయన సీనియర్ అధికారులతో సమావేశమై తాజా పరిస్థితిపై సమీక్షించారు. ఏపీఎస్‌పీడీసీఎల్ పరిధిలోని జిల్లాల్లో కర్నూలును అన్ని విషయాల్లో మొదటిస్థానంలో నిలుపుదామని పిలుపునిచ్చారు. వినియోగదారుల సంతృప్తి స్థాయిని పెంచడానికి ప్రతి ఒక్కరూ జవాబుదారీతనంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈలు శేషాద్రి , ఓబులేసు, డీఈఈ బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఔషధ దుష్ప్రభావాలు వస్తే డయల్ 18001803024



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు


కర్నూలు(హాస్పిటల్): ఔషధాలతో దుష్ప్రభావాలకు గురైతే టోల్ ఫ్రీ నంబర్ 18001803024కు కాల్ చేయాలని కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ చెప్పారు. ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలు–అవగాహన సందర్భంగా సోమవారం ఆమె మాట్లాడారు. కళాశాలలోని ఫార్మకాలజీ విభాగంలోని ఔషధ దుష్ప్రభావాల పర్యవేక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 23వ తేది వరకు 5వ జాతీయ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫార్మకాలజి హెచ్‌ఓడీ డాక్టర్ రాజేష్, ప్రొఫెసర్ డాక్టర్ ఉషారాణి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేశ్వరమ్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు డాక్టర్ భానుప్రకాష్, డాక్టర్ హరిత, డాక్టర్ రమ్య, డాక్టర్ అల్తాఫ్, డాక్టర్ రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

‘ఆడ’నే చిదిమేసి!

అడ్డూఅదుపు లేని లింగ నిర్ధారణ పరీక్షలు

- కర్ణాటక అధికారుల డెకాయిట్ ఆపరేషన్
- కోడుమూరులోని బాషా నర్సింగ్ హోం సీజ్
- కళ్లు మూసుకున్న జిల్లా అధికారులు
- 36 డెకాయిట్ ఆపరేషన్లు చేసినట్లు రికార్డులు
- తగ్గుతున్న ఆడపిల్లల నిష్పత్తి

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా.. రాజ్యాలు ఏలుతున్నా.. అంతరిక్షంలో అడుగిడుతున్నా.. ఇప్పటికీ ఆడపిల్ల పట్ల వివక్ష కొనసాగుతోంది. పెళ్లయిన ప్రతి మహిళ తన కడుపు పండాలని కోరుకుంటుంది. ఆ సంతోషం కడుపులో పడగానే తమ ప్రతిరూపాన్ని చూసుకునేందుకు నవమాసాలు నిరీక్షిస్తుంది. తల్లికి ఆడ, మగ అనే భేదం ఉండకపోయినా.. భర్త, అత్తమామలకు మాత్రం ఇప్పటికీ మగపిల్లాడిపైనే మనసు. గర్భం దాల్చడమే ఆలస్యం.. ఏ డాక్టర్ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తుందోనని ఆరా తీయడం మొదలవుతోంది. ఆడపిల్ల కడుపులో ఉందని తెలిస్తే చాలు.. ఎప్పుడెప్పుడు చిదిమేయాలనే ఆలోచన పురుడుపోసుకుంటుంది. ఇలా ఎంతో మంది ఆడపిల్లలు భూమిపై పడకుండానే రక్తపు ముద్దలుగా గాల్లో కలిసిపోతున్నారు. ఈ తంతు నిత్యకృత్యమైనా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చేష్టలుడిగి చూస్తుండటం గమనార్హం.



కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో అధికారికంగా 246 స్కానింగ్ కేంద్రాలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వద్ద రిజిస్టర్ అయ్యాయి. అనధికారికంగా పదుల సంఖ్యలో స్కానింగ్ కేంద్రాలు పనిచేస్తున్నాయి. కర్నూలు నగరంలోని గాయత్రి ఎస్టేట్, కొత్తబస్టాండ్, ఎన్‌ఆర్ పేట ప్రాంతాల్లోని పలు స్కానింగ్ కేంద్రాలు, ప్రైవేటు ఆసుపత్రుల్లో యథేచ్ఛగా స్కానింగ్ ద్వారా లింగనిర్ధారణ చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఆడపిల్లగా నిర్ధారణ అయితే రూ.5వేలు, మగబిడ్డ అని తేలితే రూ.8వేలు వసూలు చేస్తున్నారు. గర్భంలో ఉన్నది ఆడబిడ్డ అని తేలితే వైద్యులను కలిసి అబార్షన్(భ్రూణహత్యలు) చేయించుకుంటున్నారు. ఇందుకోసం రూ.20వేల నుంచి రూ.30వేల దాకా వసూలు చేస్తున్నారు.

➤ అది కోడుమూరులోని బాషా నర్సింగ్ హోం. ఆదివారమైనా ఎంతో రద్దీగా ఉంది. ఆసుపత్రిలోని స్కానింగ్ కేంద్రం వద్ద గర్భవతులు పదుల సంఖ్యలో నిరీక్షిస్తున్నారు. ఓ గర్భవతికి లింగనిర్ధారణ చేయించాలని ఓ బృందం వచ్చింది. వారు అనుకున్నట్లే వైద్యులకు విషయం చెప్పారు. వారు చెప్పినట్లే అక్కడి వైద్యులు స్కానింగ్ చేసి కడుపులో ఉన్నది ఏ బిడ్డో చెప్పేశారు. అంతే రెడ్ హ్యాండెడ్‌గా ఆ వైద్యురాలిని అధికారులు పట్టుకున్నారు. కర్ణాటక స్టేట్ పీసీ పీఎన్‌డీటీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ వివేక్ దొరై సమాచారం ఇవ్వడంతో ఏపీ స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్‌కుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ సంయుక్తంగా ఈ దాడులు చేశారు. ఈ మేరకు హాస్పిటల్‌ను సీజ్ చేశారు. ఇదే విషయంలో పదేళ్ల క్రితం ఓ ట్రైనీ కలెక్టర్ నేతృత్వంలో ఈ ఆసుపత్రిపై డెకాయిట్ ఆపరేషన్ చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని ఆసుపత్రిని సీజ్ చేశారు. రెండు రోజుల్లోనే ఆసుపత్రిలో మరో ద్వారం తెరిచి మరో స్కానింగ్ మిషన ద్వారా తమ కార్యకలాపాలను యథేచ్ఛగా మొదలుపెట్టడం గమనార్హం. అధికారులు విధి నిర్వహణలో ఎంత నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నారో ఈ ఆసుపత్రిని చూస్తే అర్థమవుతుంది.



బాషా నర్సింగ్ హోమ్‌ను సీజ్ చేసిన అధికారులు (ఫైల్)

స్కానింగ్ కేంద్రాల వద్ద మాత్రం ఇక్కడ ఎలాంటి లింగనిర్ధారణ చేయబడదని ప్రకటనలు మాత్రమే ఉంటాయి. కానీ కొన్ని కేంద్రాల్లో యథేచ్ఛగా లింగ నిర్ధారణ జరుగుతోంది. ఎమ్మిగనూరు, కోడుమూరు, కర్నూలులోని కొత్తబస్టాండ్ ప్రాంతాల్లోని పలు కేంద్రాల్లో ఆర్‌ఎంపీలే స్కానింగ్ చేస్తుండటం గమనార్హం. ఇటీవల కొత్తబస్టాండ్ సమీపంలోని మార్కెట్ యార్డు వద్దనున్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో 9 నెలల గర్భిణికి అబార్షన్ చేయాలని ప్రయత్నించారు. చివరి నిమిషంలో ఆ గర్భవతి భయపడి వెళ్లిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇక్కడి ఆసుపత్రిలో ప్రతిరోజూ ఇద్దరు, ముగ్గురికి అబార్షన్లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం తెలిసినా అధికారులు ఎవ్వరూ అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి.

➤ ఇటీవల నందికొట్కూరులో గడివేముల మండలం గని గ్రామానికి చెందిన గర్భిణికి అక్కడి ఆర్‌ఎంపీ అబార్షన్ చేయడంతో ఆమె మరణించింది. వివరాలు ఆరా తీయగా ఆమెకు కర్నూలులోని కొత్తబస్టాండ్ ఎదురుగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో స్కానింగ్ చేయగా లింగనిర్ధారణ చేశారని తేలింది. ఈ ఘటన జరిగి రెండు నెలలవుతున్నా ఎలాంటి చర్యలు లేకపోవడం గమనార్హం.

కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలోని పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ బృందం ఏడాది కాలంగా జిల్లాలో 36 డెకాయిట్ ఆపరేషన్లు(దాడులు) నిర్వహించినట్లు లెక్కలు రాసుకున్నారు. అందులో అన్ని స్కానింగ్ సెంటర్లు అద్భుతంగా పని చేస్తున్నాయని కితాబునిచ్చారు. మరి కర్ణాటక అధికారుల డెకాయిట్ ఆపరేషన్‌లో కోడుమూరు ఘటన వెలుగులోకి రావడం చూస్తే ఇక్కడి అధికారుల పనితీరు ఏస్థాయిలో ఉందో అర్థమవుతోంది.

దాడులు ముమ్మరం చేస్తాం



పీసీ పీఎన్‌డీటీ చట్టం ప్రకారం లింగనిర్ధారణ చేయడం నేరం. లింగనిర్ధారణ, గర్భస్రావాలు చేసిన, చేయించిన ఇద్దరికీ శిక్షలు తప్పవు. మొదటిసారి తప్పు చేస్తే మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా, రెండోసారి తప్పు చేస్తే ఐదేళ్ల జైలు శిక్ష, రూ.50వేల జరిమానా ఉంటుంది. స్కానింగ్, అబార్షన్ చేసిన సదరు వైద్యుల పేరును భారత వైద్యవిధాన మండలి నుంచి తాత్కాలికంగా, కొన్నిసార్లు శాశ్వతంగా తొలగిస్తారు. ఇలాంటి ఘటనలపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే డెకాయిట్ ఆపరేషన్లు చేస్తున్నాం. ఇకపై మరింత ముమ్మరం చేస్తాం.

–డాక్టర్ పి.శాంతికళ, డీఎంహెచ్‌ఓ, కర్నూలు

తగ్గుతున్న ఆడపిల్లల సంఖ్య

జిల్లాలో ఆడ, మగపిల్లల నిష్పత్తిలో గణనీయమైన తగ్గుదల కనిపిస్తోంది. వెయ్యి మంది మగపిల్లలు ఉంటే ఐదేళ్ల క్రితం 920 మంది ఆడపిల్లలు ఉండేవారు. ఇప్పుడు ఆ సంఖ్య 900లోపు చేరుకుందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా అక్షరాస్యత తక్కువగా ఉండే ఆదోని, కర్నూలు డివిజన్‌లో పురుషుల కంటే స్త్రీల సంఖ్య తక్కువగా ఉంది. కోసిగి, నందవరం, సి.బెళగల్, గూడూరు, కల్లూరు, జూపాడుబంగ్లా, హొళగుంద, హాలహర్వి, ఆలూరు, ఆస్పరి, కోడుమూరు, గోనెగండ్ల, వెల్దుర్తి, తుగ్గలి మండలాల్లో మగవారి కంటే స్త్రీల సంఖ్య తక్కువగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

అబార్షన్‌లతో తీవ్ర అనారోగ్యం

మాకు మగబిడ్డే కావాలని, కడుపులో ఉన్నది ఆడపిల్లని తెలియగానే కొందరు తరచూ అబార్షన్లు చేయిస్తుంటారు. ఇది ఆ తల్లి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. తరచూ గర్భం దాల్చడం వల్ల బీపీ, రక్తహీనత, షుగర్ వచ్చే అవకాశం ఉంది. ఆ తర్వాత జన్మించే పిల్లలు సైతం నెలలు నిండకముందే జన్మిస్తారు. ఇది శిశువుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. పుట్టబోయే బిడ్డ సరిగ్గా ఎదగనప్పుడు, తల్లికి నియంత్రించలేని బీపీ ఉన్నప్పుడు, 3, 4వ స్టేజీలో తల్లికి క్యాన్సర్ ఉన్నా తప్పనిసరి పరిస్థితిలో అబార్షన్ చేయాల్సి ఉంటుంది.

బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో పోలీసుల తనిఖీ

కర్నూలు: ఆంధ్ర – ఒరిస్సా సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయి, డ్రగ్స్, మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా జరుగుతోందనే సమాచారంతో పోలీసులు కర్నూలు కొత్తబస్టాండ్, రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. లోకల్, జీఆర్పీ పోలీసులతో పాటు డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ బృందాలు, స్పెషల్ పార్టీ పోలీసులు రైల్వేస్టేషన్‌కు చేరుకుని కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ ఆధ్వర్యంలో కర్నూలు నుంచి నంద్యాలకు వెళ్తున్న రైలులో విస్తృత తనిఖీలు నిర్వహించారు. అలాగే పార్సిల్ కార్యాలయంలో కూడా అనుమానాస్పదంగా ఉన్న వస్తువులను పరిశీలించారు. నెలల తరబడి పార్సిల్ డెలివరీ కాకుండా ఉన్న వస్తువులను నిశితంగా పరిశీలించారు. రైలు బోగీల్లో అనుమానాస్పద వ్యక్తులు, బ్యాగులను పరిశీలించారు. కొందరు వ్యక్తులు ప్రయాణికుల చాటున ఎటువంటి అనుమానం రాకుండా రైళ్లలో డ్రగ్స్, గంజాయి వంటి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని, ఎక్కడైనా అలాంటి వారు తారసపడితే టోల్‌ఫ్రీ నంబర్ 1972కు సమాచారం అందించాలని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ బస్టాండ్‌లో నాలుగో పట్టణ సీఐ విక్రమ సింహా ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు.



కొత్తబస్టాండ్‌లో బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

'కాల్ మనీ పేరిట వేధిస్తున్నారు'

కర్నూలు: 'పోతిరెడ్డి అనే వ్యక్తి కాల్ మనీ పేరిట అధిక వడ్డీలతో నా భర్త రఘుపతిరెడ్డిని ఇబ్బందులకు గురిచేస్తే బాధ భరించలేక ఆయన ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంకా వడ్డీ కింద ఆస్తులు రాసివ్వాలంటూ కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నాడు'అని కర్నూలు మండలం పసుపుల గ్రామానికి చెందిన ఓ మహిళ ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. కర్నూలు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కనున్న క్యాంప్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి నేరుగా వారితో మాట్లాడి సమస్యలను ఎస్పీ తెలుసుకున్నారు. పీజీఆర్‌ఎస్‌కు మొత్తం 65 ఫిర్యాదులు వచ్చాయి. వాటన్నింటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. అడ్మిన్ ఏఎస్పీ హుసేన్ పీరా కూడా కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దు

- సమస్యలను వెంటనే పరిష్కరించండి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి

కర్నూలు(సెంట్రల్): ప్రజలను పదే పదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి ఆదేశించారు. ఆర్థిక సంబంధం లేని సమస్యల పరిష్కారంలో ఏ మాత్రం జాప్యం చేయకూడదన్నారు. ప్రజలు ఎంతో దూరం నుంచి వస్తారని, వారిచ్చిన అర్జీలకు వెంటనే స్పందించాలన్నారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ ప్రభుత్వ సేవలకు సంబంధించి జిల్లాలో ఐవీఆర్‌ఎస్ ఫీడ్ బ్యాక్ బాగోలేదని, ఇందులో పురోగతి చూపాలన్నారు. సీఎంఓ, డిప్యూటీ సీఎం, విద్యాశాఖమంత్రుల నుంచి వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కొండయ్య పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి, జిల్లా అధికారులు

పోలీసులు అత్యుత్సాహం



పెద్దమారెప్పను పక్కకు తీసుకెళ్తున్న పోలీసులు

పీజీఆర్‌ఎస్‌లో కొందరు పోలీసులు అత్యుత్సాహం చూపారు. కలెక్టరేట్‌కు చాలా సార్లు వచ్చినా సమస్య పరిష్కారం కావడంలేదని ఎవరైనా అంటే వెంటనే పోలీసులు వచ్చి పక్కకు తీసుకెళ్లారు. ఆలూరు మండలం మొలగవెల్లికి చెందిన జి.పెద్ద మారెప్ప తన పొలం మధ్యలో కాకుండా రస్తాను మధ్యలో ఉంచాలని అధికారులు కోరాడు. గతంలో రెవెన్యూ అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో కోర్టుకు వెళ్లగా తనకు అనుకూలంగా తీర్పు వచ్చిందని, అయినా పొలం మధ్యలోనే రస్తా వెళ్తోందని, పోలీసులను వేడుకున్నా పట్టించుకోలేదన్నారు. దీంతో పోలీసులు అక్కడి నుంచి వృద్ధుడిని పక్కకు తీసుకెళ్లారు. అలాగే కోడుమూరు మండలం లద్దగిరికి చెందిన వృద్ధురాలు ప్రభావతిని సైతం పక్కకు తీసుకెళ్లారు. కొందరి మాటలు విన్ని తన పొలాన్ని రెవెన్యూ అధికారులు రెడ్‌మార్కులో పెట్టారని, అమ్ముకోవడం ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తన పొలానికి సంబంధించి అడంగల్ పాసు బుక్కు ఉన్నప్పటికీ వేరే వారి అనుమతి ఎందుకు తీసుకుంటారని ప్రశ్నించారు.

ఫిర్యాదుల్లో కొన్ని....

- తన పొలానికి వెళ్లనీయకుండా అక్రమణదారులు వేస్తున్నారని, వారి నుంచి ప్రాణ భయం ఉందని, న్యాయం చేయాలని ఆస్పరి మండలం ములుగుందం గ్రామాని చెందిన అంజినమ్మ అర్జీ ఇచ్చారు.
- తన భర్త విద్యుత్ ప్రమాదంలో మృతి చెందాడని, అత్తింటి వాళ్లు ఇంట్లో ఉండనీయడం లేదని, తన భర్త పేరిట ఉన్న రెండు ఎకరాల పొలాన్ని ఇచ్చి నాకు న్యాయం చేయాలని రోజా అనే మహిళ అర్జీ ఇచ్చారు.
- ఖరీఫ్‌లో నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం రాష్ట్రకార్యదర్శి జగన్నాథం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

శైలపుత్రి శరణు..శరణు!

- శ్రీగిరిపై వైభవంగా దసరా మహోత్సవాలు
- శాస్త్రోక్తంగా యాగశాల ప్రవేశం చేసి ఉత్సవాలకు అంకురార్పణ
- శైలపుత్రిగా భ్రామరీ, భృంగివాహనంపై ఆది దంపతుల విహారం

శ్రీశైలంటెంపుల్: దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా శ్రీశైల భ్రామరీ శైలపుత్రిగా దర్శనమిస్తూ భక్తులను కరుణించారు. అష్టాదశ శక్తిపీఠాలలో ఒకరైన భ్రమరాంబాదేవి వెలసిన శ్రీశైల మహాక్షేత్రంలో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం 8 గంటలకు వేదమంత్రోచ్చారణల మధ్య మంగళవాయిద్యాల నడుమ అర్చకులు, వేదపండితులు ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ముందుగా శ్రీశైల దేవస్థాన ఈఓ శ్రీనివాసరావు దంపతులు ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, స్థానాచార్యులు, అర్చకస్వాములు, వేదపండితులు సంప్రదాయబద్ధంగా పసుపు, కుంకుమలు, ఫలపుష్పాదులతో ఆలయ ప్రవేశం చేశారు. ఉత్సవాలకు నాంది పలుకుతూ ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం, గణపతిపూజ, దీక్షాసంకల్పం, కంకణపూజ, కంకణధారణ, రుత్విగ్వరణం కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే అఖండదీపాస్థాపన, వాస్తుపూజ, మండపారాధనలు, చండీ కలశస్థాపన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ సంకల్పాన్ని పఠించారు. రాత్రి 7.30 గంటల తర్వాత అమ్మవారి ఆలయం ముందు ప్రత్యేక వేదికపై శైలపుత్రి అలంకృతులైన అమ్మవారిని ఆశీనులను చేసి అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజాదికాలను, హారతులిచ్చారు. పరాశక్తి నవదుర్గా రూపాలలో మొదటి స్వరూపం శైలపుత్రి. శరన్నవరాత్రుల ఉత్సవాలలో మొదటి రోజు ఈ దేవిని పూజిస్తారు. వృషభాన్ని వాహనముగా గల ఈ దేవి ద్విభుజాలను కలిగి, కుడిచేతిలో త్రిశూలాన్ని, ఎడమ చేతిలో పద్మాన్ని ధరించి ఉంటుంది. ఈ దేవిని పూజించడం వలన విశేష ఫలితాలు కలగడంతో పాటు సర్వత్రా విజయాలు లభిస్తాయని, ముఖ్యంగా ఈ దేవి ఆరాధన వలన ముత్తైదువులకు ఐదవతనం వృద్ధి చెందుతుందని పండితులు చెబుతున్నారు.



ప్రత్యేక అలంకీకృతులైన స్వామి అమ్మవార్లకు ఆలయ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



భృంగివాహన సేవ పూజలు చేస్తున్న అర్చకులు



ఉత్సవంలో కళారూపాలు

కమనీయం భృంగి వాహనసేవ

దసరా మహోత్సవాల్లో భాగంగా మొదటిరోజు శ్రీస్వామిఅమ్మవార్లకు భాగంగా భృంగివాహనసేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరింపజేసి భృంగివాహనంపై ఉంచి ప్రత్యేక పూజాదికాలతో హారతులిచ్చారు. గ్రామోత్సవంలో నాదస్వరం, కేరళ చండీమేళం, కొమ్ము, కోయనృత్యం, సంప్రదాయ నృత్యం థయ్యం, విళక్కు, స్వాగత నృత్యం, కోలాటం, రాజభటుల వేషాలు, జానపద పగటి వేషాల ప్రదర్శన, అశ్వప్రదర్శన, డమరుకం, చిడతలు, పిల్లన్నగ్రోవి, శంఖం, త్రిశూలం, జేగంట, కంచుడోలు, తాళాలు, చెక్కభజన, వీరభద్ర డోలు కుణిత తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

రేషన్ బియ్యం లారీ సీజ్?

ఆదోని అర్బన్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని కర్ణాటక పోలీసులు ఆదివారం రాత్రి సీజ్ చేసినట్లు తెలిసింది. ఆదోని నుంచి అహ్మదాబాద్‌కు 35 టన్నుల రేషన్ బియ్యంతో అక్రమంగా వెళ్తున్న లారీని కర్ణాటక రాష్ట్రం సింధనూరు రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి రశీదులు లేకపోవడంతో లారీని సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఇదిలాఉంటే బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి ఆదోని పట్టణంలోని నలుగురు కూటమి నాయకుల హస్తం ఉన్నట్లు తెలిసింది. లారీ డ్రైవర్ ఇచ్చిన సమాచారం మేరకు వారిపైనా కేసు నమోదు చేసినట్లు సమాచారం.



కర్ణాటక పోలీస్‌స్టేషన్‌లో సీజ్ చేసిన లారీ

క్లుప్తంగా

గుడేకల్ చెరువులో యువకుడి మృతదేహం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ చెరువులో సోమవారం సాయంత్రం యువకుడి మృతదేహం కనిపించింది. ఆదోని పట్టణంలోని ఎంజీ కాలనీకి చెందిన సత్రాజ్ షరీఫ్(35) మృతదేహం అని పోలీసులు తెలిపారు. ఈ యువకుడు బెట్టింగ్ ఆడుదూ అప్పులు చేసి ఇంటి నుంచి ఈ నెల 11వ తేదీ కనిపించకుండా వెళ్లాడు. కుటుంబ సభ్యులు ఆదోని 3వ పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులు.. బంధువులు, స్నేహితులకు ఫోన్లు చేసినా సమాచారం దొరకలేదు. సోమవారం సాయంత్రం గుడేకల్ చెరువులో మృతదేహం లభ్యం కావటంతో ఆదోని పోలీసులకు సమాచారం వచ్చింది. వారు వెళ్లి పరిశీలించగా షరీఫ్ మృతదేహం అని తేలింది. కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం


నాగలక్ష్మమ్మ (ఫైల్)

మహానంది: మహానంది మండలం తమ్మడపల్లె గ్రామానికి చెందిన వివాహిత అయిజ నాగలక్ష్మమ్మ రెండు రోజుల క్రితం అదృశ్యం అయినట్లు మహానంది ఎస్‌ఐ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి ఆయన మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోవడంతో ఆమె భర్త లక్ష్మయ్య ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆచూకీ తెలిస్తే పోలీసులకు (9121101093) సమాచారం అందించాలన్నారు.

మద్యానికి బానిసై..

కొలిమిగుండ్ల: మీర్జాపురానికి చెందిన మొట్టె రంగస్వామి (48) మద్యానికి బానిసై సోమవారం తెల్లవారు జామున ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి..మృతుడు రంగస్వామి మద్యానికి బానిసగా మారి ఏపని చేయకుండా ఖాళీగా ఉంటుండేవాడు. చివరకు ఇంట్లో ఉన్న ధాన్యం అమ్ముకొని మద్యం సేవిస్తూ వచ్చాడు. కుటుంబ సభ్యులు నచ్చజెప్పినా మార్పు రాలేదు. చివరకు ఇంటి పక్కన ఉన్న కుంకుడు కాయల చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో 'యూబీఐ' ఉద్యోగి మృతి


మృతిచెందిన సురేంద్ర గౌడ్

కర్నూలు: కర్నూలు నుంచి డోన్‌కు వెళ్లే 44వ నంబర్ జాతీయ రహదారిపై శ్రీచక్ర హాస్పిటల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) రీజనల్ ఆఫీస్ (బిర్లా కాంపౌండ్)లో డిప్యూటీ రీజనల్ హెడ్‌గా పనిచేస్తున్న ఇ.సురేంద్రగౌడ్ (40) మృతిచెందాడు. ఈయన కల్లూరు మండలం బళ్లారి చౌరస్తా సమీపంలోని శివరామకృష్ణా నగర్‌లో నివాసం ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం తన ఆఫీసులో పనిచేసే మెసెంజర్ రాఘవేంద్రను తన బైక్‌లో కూర్చోబెట్టుకుని కృష్ణానగర్ వైపు వెళ్తుండగా శ్రీ చక్ర హాస్పిటల్ సమీపంలో హైదరాబాద్ నుంచి బెంగుళూరు వైపు వెళ్తున్న గుర్తు తెలియని కంటైనర్ లారీ ఢీకొట్టడంతో ఇద్దరూ బైక్ పైనుంచి కింద పడ్డారు. సురేంద్రగౌడ్‌కు తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వెనకాల కూర్చున్న రాఘవేంద్ర చేతులకు స్వల్ప గాయాలై ప్రమాదం నుంచి బయటపడ్డాడు. స్థానికులు ఇద్దరినీ శ్రీచక్ర హాస్పిటల్‌కు వైద్య చికిత్సల నిమిత్తం తరలించగా సురేంద్ర గౌడ్ అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. రాఘవేంద్ర ఆసుపత్రిలో ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. విషయం తెలిసిన వెంటనే ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. రాఘవేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దేవీ.. నమోస్తుతే!


చాగలమర్రిలో రాజరాజేశ్వరి దేవి అలంకారం


మహానందిలో మయూర వాహనంపై విహరిస్తున్న శైలపుత్రీ దుర్గ


మద్దిలేటి స్వామి ఆలయంలో ఆదిలక్ష్మి అలంకారంలో..


నందవరంలో శైలపుత్రిదేవి అలంకారంలో పూజలు


నూనెపల్లె అమ్మవారి శాలలో బొమ్మలకొలువు


ఆదోనిలో పూజలందుకున్న శ్రీ మహాయోగి లక్ష్మమ్మఅవ్వ మూలవిరాట్


కటారుకొండ గ్రామంలో బాల త్రిపుర సుందరిదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు


ఓంకార క్షేత్రంలో రాజరాజేశ్వరి దేవిగా పూజలు అందుకున్న అమ్మవారు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పలు దేవస్థానాల్లో బొమ్మల కొలువును తీర్చిదిద్దారు. హోమాలు, కుంకుమార్చనలు, సంకీర్తనలతో ఆధ్యాత్మిక శోభ కనిపించింది. మండపాల్లోని దుర్గామాతను దర్శించుకుని 'దేవీ.. నమోస్తుతే' అంటూ ప్రజలు పూజలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్


కర్నూలులో దుర్గా దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేస్తున్న భక్తులు

రూ.20 వేలు వద్దు... మద్దతు ధరనే కావాలి!

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వం రూ.1200 మద్దతు ధరతో ఉల్లి కొనుగోళ్లకు స్వస్తి పలికి ఎకరాకు రూ.20 వేల ప్రకారం పరిహారం చెల్లిస్తామని ప్రకటించడం పట్ల ఉల్లి రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మాకు ఎకరాకు రూ.20 వేలు వద్దే వద్దు.. మద్దతు ధరతోనే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మార్క్‌ఫెడ్ రైతుల నుంచి దాదాపు 70 వేల క్వింటాళ్ల ఉల్లిని కొనుగోలు చేసింది. దాదాపు 10 వేల మంది రైతులకు మద్దతు ధర ఇచ్చిన ప్రభుత్వం మిగిలిన రైతులకు మాత్రం ఎకరాకు రూ.20 వేలు మాత్రమే చెల్లిస్తామనడం పట్ల రైతులు మండి పడుతున్నారు. ఈ–క్రాప్ ప్రకారం ఇప్పటివరకు 50 వేల ఎకరాల్లో ఉల్లి సాగయింది. ఈ–క్రాప్ ఇంకా కొనసాగుతుండటంతో విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది. ఎకరాకు రూ.లక్షకు పైగా పెట్టుబడి వ్యయం వస్తోంది. అయితే అధిక వర్షాలు ఉల్లి రైతులను దెబ్బతీశాయి. ప్రతి రైతు ఎకరా సాగులో కనీసం 20 క్వింటాళ్ల వరకు పారబోశారు. ఉల్లి క్వింటాకు లభిస్తున్న సగటు ధర రూ.500 మాత్రమే. 40 శాతం మంది రైతులకు రూ.100, రూ.200, రూ.300 ధర లభిస్తుండటం గమనార్హం. దీంతో రైతులు మద్దతు ధరతోనే ఉల్లి కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రూ.20 వేలు చెల్లించడం జరిగేనా!

గతంలో మిర్చి పంటను క్వింటాలుకు రూ.11700 ప్రకారం కొంటామని ప్రకటించింది. ఒక్క రైతుకు కూడ ఈ ప్రకారం ధర చెల్లించిన దాఖలాలు లేవు. పొగాకు రైతుకు న్యాయం చేస్తామని, మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేస్తామని ప్రకటించారు. జిల్లాలో ఒక్క రైతు నుంచి కూడ పొగాకు కొనుగోలు చేయలేదు. ఇపుడు ఉల్లి సాగుకు సంబంధించి ఎకరాకు రూ.20 వేలు చెల్లిస్తామని సీఎం ప్రకటించారు. దీనిని రైతులు విశ్వసించడం లేదు.


మార్కెట్‌కు వచ్చిన ఉల్లి

ఒక్కసారిగా తగ్గిన ఉల్లి తాకిడి

ఉల్లికి మద్దతు ధర లేదని ప్రకటించడంతో ఒక్కసారిగా మార్కెట్‌కు ఉల్లి తాకిడి తగ్గడం గమనార్హం. ఈ నెల 21న మార్కెట్‌కు సెలవు. మొన్నటి వరకు రోజుకు 14 వేల క్వింటాళ్ల వరకు వచ్చింది. గరిష్ఠంగా రూ.18500 క్వింటాళ్లు కూడా వచ్చింది. అయితే సోమవారం 2445 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. ఈ పరిస్థితిని చూస్తే కమీషన్ ఏజెంట్లే మార్కెట్‌కు తెచ్చిన ఉల్లిని నామమాత్రపు ధరతో కొని దానిని బయటికి తరలించి అదే ఉల్లిని మళ్లీ లోపలికి తెచ్చారనే విషయం స్పష్టమవుతోంది.

మద్దతు ధరతోనే కొనుగోలు చేయాలి



ఈ ఖరీఫ్‌లో 2 ఎకరాల్లో ఉల్లి సాగు చేశాం. ఎకరాకు రూలక్షకు పైనే పెట్టుబడి పెట్టాం. గత నెల 15న 92 క్వింటాళ్ల ఉల్లి అమ్ముకున్నాం. ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా బ్యాంకు ఖాతాకు జమ కాలేదు. తాజాగా 38 క్వింటాళ్లు తెచ్చాం. క్వింటాకు రూ.240 ధర లభించింది. ఈ ధరతో అమ్ముకుంటే రూ.9120 వస్తుంది. ఎకరాకు రూ.20 వేలు ఇచ్చినా.. వస్తున్న మొత్తం రూ.30 వేల వరకే. నష్టం ఊహించడానికే భయమేస్తోంది. ఉల్లిని ప్రభుత్వం మద్దతు ధరతోనే కొనుగోలు చేయాలి.
– శ్రీరాములు, ఎర్రకోట, ఎమ్మిగనూరు మండలం

ఉల్లి సాగు పెరిగిందంట!

- టీడీపీ నేతల మాయాజాలం
- ఎకరాకు రూ.20 వేలు పరిహారం ప్రకటించిన తర్వాత పెరుగుతున్న సాగు విస్తీర్ణం

కర్నూలు(అగ్రికల్చర్): టీడీపీ నేతల మాయాజాలంతో జిల్లాలో ఉల్లి సాగు విస్తీర్ణం అమాంతం పెరిగిపోతోంది. ఎకరాకు రూ.20వేలు పరిహారం చెల్లిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంతో ఈ–క్రాప్‌లో ఉల్లి సాగు శరవేగంగా పెరిగిపోతుండటం పలు అనుమానాలకు తావు ఇస్తోంది. ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం నాటికి 44,468 ఎకరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేశారు. ఆదివారం సెలవు అయినందున పంటల నమోదుకు వెళ్లిన దాఖలాలు లేవు. అయితే సోమవారం సాయంత్రానికి 50,300 ఎకరాల్లో ఉల్లిసాగు అయినట్లు నమోదు చేశారు. మరో రెండు రోజుల్లో 60 వేల ఎకరాలకు వెళ్లినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇంకా ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి కాలేదు. ప్రక్రియ పూర్తయ్యేలోపు ఉల్లి సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది. గ్రామస్థాయి టీడీపీ నేతలు, కార్యకర్తలు, టీడీపీ మద్దతుదారులు రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జీలతో అడ్డుగోలుగా నమోదు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ–క్రాప్ నమోదుపై జిల్లా యంత్రాంగంలో అనుమానాలు రావడంతో రెవెన్యూ అధికారుల ద్వారా ర్యాండమ్‌గా తనిఖీలు చేపట్టాలనే ఉద్దేశంతో ఉన్నట్లు తెలుస్తోంది.

ఉల్లి పంటను దున్నేసిన రైతు


పోలకల్లో ఉల్లి పంటను టాక్టర్‌తో దున్నుతున్న దృశ్యం

సి.బెళగల్: కోతకు వచ్చిన ఉల్లి పంటను పొలంలోనే వదిలేసి కొంతమంది రైతులు పశువులు, గొర్రెలకు మేపుగా వదిలివేస్తుండగా, మరికొంత మంది ట్రాక్టర్లతో దున్నేస్తున్నారు. సోమవారం మండల పరిధిలోని పోలకల్ గ్రామానికి చెందిన గోకం దుబ్బన్న అనే ఉల్లి రైతు చేతికి వచ్చిన ఉల్లి పంటను పొలంలోనే ట్రాక్టర్‌తో దున్నించాడు. ఖరీఫ్ సీజన్‌లో భాగంగా రైతు రెండు ఎకరాల పొలంలో ఉల్లి పంటను సాగు చేసుకోగా ప్రస్తుతం చేతికి వచ్చింది. అయితే మార్కెట్‌లో ధర అంతంత మాత్రమే ఉండటంతో సోమవారం కోతకోసిన పంటను ట్రాక్టర్‌తో పొలంలో కలియదున్నేశారు.

బన్ని ఉత్సవాల్లో రక్తపాతానికి తావివ్వొద్దు

కర్నూలు(సెంట్రల్): అక్టోబర్ 2న దేవరగట్టు బన్ని ఉత్సవాలను రక్తపాతానికి తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో దేవరగట్టు బన్ని ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులు, దేవస్థాన కమిటీ సభ్యులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవాలకు వచ్చే సుమారు 2 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి లోపం తలెత్తరాదన్నారు. ఉత్సవాల పర్యవేక్షణకు 100 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా దేవరగట్టుకు చేరుకునే అన్ని రోడ్ల మరమ్మతు చేపట్టాలని ఆదేశించారు. అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు కలిగిన 4 అంబులెన్స్‌లు, 20 పడకల తాత్కాలిక ఆసుపత్రిని సిద్ధం చేయాలన్నారు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ మాట్లాడుతూ అవసరమైన ప్రదేశాల్లో బారికేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇరుకు రోడ్డును విస్తరించాలన్నారు. పోలీసు, అబ్కారీ శాఖ సమన్వయంతో నాటు సారా, మద్యం అమ్మకాలు, సరఫరా నియంత్రణకు చర్యలు చేపడతామన్నారు. సీసీ కెమెరాలతో పాటు 10 డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచనున్నట్లు చెప్పారు. అనంతరం శ్రీమాళా సహిత మల్లేశ్వర స్వామి దసరా ఉత్సవాల ఆహ్వానపత్రికను కమిటీ సభ్యులతో కలసి కలెక్టర్, ఎస్పీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ, ఆర్‌డీఓ భరత్ నాయక్, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకరరెడ్డి, డీపీఓ భాస్కర్ పాల్గొన్నారు.


ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, ఎస్పీ విక్రాంత్‌పాటిల్

వైద్యులకు సామాజిక దృక్పథం అవసరం

- కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): వైద్యులకు సామాజిక దృక్పథం అవసరమని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ అన్నారు. కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో సోమవారం కళాశాల ఆడిటోరియంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ.. వైద్య విద్య పూర్తి చేయాలంటే విద్యార్థులకు దృఢ సంకల్పంతో పాటు అంకిత భావం ముఖ్యమన్నారు. ప్రణాళికాబద్ధంగా చదివితే సులభంగా వైద్యవిద్యను పూర్తి చేయవచ్చని తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజీకి ఎంతో గొప్ప పేరుందని, ఆ కీర్తిని నిలపాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థికీ ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వైద్యవిద్యలో ప్రతిరోజూ విలువైనదేనని, అది పూర్తయ్యే వరకు రోజువారి ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ హరిచరణ్, డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ విజయానందబాబు, మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ కో ఆర్డినేటర్ డాక్టర్ సింధియా శుభప్రద, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్, ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ కె.చిట్టినరసమ్మ, డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

ప్రాణం తీసిన విద్యుదాఘాతం


మాల మారెన్న (ఫైల్)

హొళగుంద: మండల పరిధిలోని లింగంపల్లి గ్రామానికి చెందిన మాల మారెన్న (39) అనే వ్యక్తి సోమవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. మాల మారెన్న గ్రామంలో ఈడిగా ఈరన్న అనే వ్యక్తికి చెందిన ట్రాక్టర్‌లోని పత్తి సంచులను కిందకు దించేందుకు వెళ్లాడు. పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మాల మారెన్నకు భార్య సత్తెమ్మ, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు హెడ్‌కానిస్టేబుల్ రామ్ నాయక్ విలేకరులకు తెలిపారు.

మృతదేహంతో ధర్నా

విద్యుత్ తీగలు వేలాడుతున్న చోట ట్రాక్టర్ నిలబెట్టి కూలి పనికి వచ్చిన మారెన్న మృతికి రైతు ఈరన్న కారణమయ్యాడని మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. సోమవారం రాత్రి మృతదేహాన్ని ఆదోని నుంచి లింగంపల్లికి తీసుకొచ్చి రైతు ఈరన్న ఇంటి ముందు ఉంచి ఆందోళనకు దిగారు. రైతు కుటుంబ సభ్యులు ఇంట్లో లేకపోవడంతో ఆందోళనను రాత్రి కూడా కొనసాగిస్తున్నారు. ఉదయం వరకు చూస్తామని అయినా పట్టించుకోకపోతే అక్కడే ఖననం చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న హొళగుంద ఎస్‌ఐ దిలీప్‌కుమార్ బాధితులతో చర్చిస్తున్నారు.

టైరు పేలి సుమో బోల్తా



డోన్ టౌన్: పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై ఉడుములపాడు దత్తాత్రేయ స్వామి దేవాలయం వద్ద సోమవారం సుమో వాహనం టైరు పేలి బోల్తా పడింది. అందులో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వాహనం నందికొట్కూరు నుంచి కదిరి వైపు వెళ్తుండగా ఈప్రమాదం జరిగింది. పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా, ఎస్‌ఐ నరేంద్రకుమార్ సంఘటన స్థలానికి చేరుకుని రోడ్డుపై పడ్డ వాహనాన్ని తొలగించారు.

చెలిమిల్లలో పిచ్చికుక్కల స్వైర విహారం

- 8 మందిపై దాడి
- భయాందోళనలో గ్రామస్తులు


పిచ్చి కుక్క దాడిలో గాయపడిన ప్రజలు

పాములపాడు: చెలిమిల్ల గ్రామంలో సోమవారం రెండు పిచ్చి కుక్కలు రోడ్లపై కనిపించిన వారిపై దాడికి పాల్పడ్డాయి. గ్రామానికి చెందిన రమేష్, సుబ్బమ్మ, అయ్యమ్మ, చిన్న లక్ష్మయ్య, అబ్రహాం, అనసూయబాయి, శివారెడ్డి, డియోనాథ్‌ను కరిచాయి. గాయాలపాలైన వారు వెంటనే ఆత్మకూరు, పాములపాడు ప్రభుత్వ వైద్యశాలలకు పరుగులు తీశారు. జనంపై దాడి చేసిన ఓ పిచ్చి కుక్కను గ్రామస్తులు మట్టుబెట్టి జేసీబీతో గొయ్యి తీసి పూడ్చి వేశారు. నాగపుల్లయ్య అనే రైతుకు చెందిన మేక, చెన్నమ్మకు చెందిన రెండు మేకలపై పిచ్చి కుక్కలు దాడి చేసి గాయ పరిచాయి. అలాగే మరో 5 వీధి కుక్కలను కూడా కరిచాయి. ఏ కుక్కను చూసినా ప్రజలు భయాందోళకు గురవుతున్నారు. ప్రతి గ్రామంలో కుక్కల సంతతి విపరీతంగా పెరగడంతో వాటి స్వైర విహారం ఎక్కువైంది. ఎక్కడ చూసినా గుంపులుగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం దసరా సెలవులు కావడంతో పిల్లలు వీధుల్లో ఆడుకునేందుకు వెళ్తుండటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఏ కుక్క ఎక్కడి నుంచి వచ్చి దాడి చేస్తుందోనని భయపడుతున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని గ్రామాల్లో వీధి కుక్కలను పట్టుకుని ఇతర ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు.

అమ్మకు కుమారుడి లాలి!

పుట్టిన కుమారుడిని అమ్మ లాలిస్తుంది.. మురిపెంగా అన్నం తినిపిస్తుంది.. దాహం వేస్తే నీళ్లు తాపిస్తుంది.. చక్కగా నెత్తి దువ్వి ఎవరి దిష్టి తగలకుండా తిలకం దిద్దుతుంది.. పలకాబలపం ఇచ్చి స్కూల్‌కు పంపిస్తుంది. అయితే ఎమ్మిగనూరు మండలం దైవందిన్నె గ్రామంలో అమ్మకే కుమారుడు లాలి పాట పాడుతున్నాడు. ఇందుకోసం పాఠశాలకు వెళ్లడం మానుకున్నాడు. అన్నం వండి పెడుతూ ఆకలి తీరుస్తున్నాడు. అమ్మను చిన్నారి అనుకుని మోస్తూ ప్రపంచాన్ని చూపిస్తున్నాడు. కూలీ పనులు చేసి వచ్చిన డబ్బుతో మాత్రలు కొనుగోలు చేసి మింగిస్తున్నాడు. అమ్మ బాగా నడవాలని దేవున్ని వేడుకుంటున్నాడు.


మంచానికే పరిమితమైన తల్లికి నీరు తాపుతున్న ప్రసన్నరాజు

ఏం జరిగిందంటే..

దైవందిన్నె గ్రామానికి చెందిన సంకటి నాగరాజు, సంకటి ఎల్లమ్మకు పెళ్లయిన 12 సంవత్సరాలకు సంకటి ప్రసన్నరాజు జన్మించాడు. లేకలేకపుట్టిన కుమారుడిని వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ తల్లిదండ్రులు స్కూల్‌కు పంపేవారు. అయితే ఆరు సంవత్సరాల క్రితం సంకటి ఎల్లమ్మకు పక్షపాతం రావటంతో మంచానికి పరిమితమైంది. వివిధ పనులు చేస్తూ కుటుంబానికి అండగా ఉన్న నాగరాజు అనారోగ్యంతో కొన్ని నెలల క్రితం మృతి చెందాడు. దీంతో బాలుడు ప్రసన్నరాజు స్కూల్‌కు వెళ్లడం మానుకున్నాడు. తల్లికి అన్నీ తానై సేవలు చేస్తున్నాడు. కూలీ పనులకు వెళ్తూ వచ్చిన డబ్బులతో తల్లికి మందులు తెస్తున్నాడు. తాను ఒక్కొక్క రోజు పస్తులు కూడా ఉంటున్నట్లు బాలుడు కన్నీటితో చెప్పాడు. తన తల్లికి పింఛన్ వస్తే మందుల ఖర్చులకు డబ్బులు వస్తాయని కుమారుడు రాజు అంటున్నాడు. తన తల్లితో పాటు తాను కూడా పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకోవాలని చాలా సార్లు అనుకున్నానని, అయితే కష్టాన్ని నమ్ముకుని బతుకుతున్నానని, తన తల్లికి పింఛన్ ఇవ్వాలని కోరాడు.
– ఎమ్మిగనూరురూరల్

సాక్షి బిజినెస్
మంగళవారం
23-9-2025

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▽	466	82,160
నిఫ్టీ ▽	125	25,202

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	22,775	△	143
డోజోన్స్	46,419	△	103
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,232	△	16
డాక్స్	23,533	▽	106
షాంఘై	3,829	△	8
నికాయ్	45,494	△	448

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.80	88.82
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	118.23	121.22
€	యూరో	ఎస్‌బీఐ	102.23	105.02
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.28	60.80
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.29	59.57
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.27	69.97
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.60	24.10
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.09	24.35
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.50	13.32

పండుగల ముందు పసిడి పరుగు

- ఒకే రోజు రూ.2,200 పెరుగుదల
- ఢిల్లీలో కొత్త గరిష్టం 1,16,200

న్యూఢిల్లీ: పండుగల ముందు పసిడి ధరలు పరుగులు పెడుతున్నాయి. సోమవారం ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత పసిడి 10 గ్రాములకు ఏకంగా రూ.2,200 పెరిగి మరో కొత్త జీవితకాల గరిష్ట స్థాయి రూ.1,16,200కి చేరుకుంది. వెండి సైతం రూ.4,380 ర్యాలీ చేసి కిలోకి రూ.1,36,380 స్థాయిని (కొత్త ఆల్‌టైమ్ గరిష్టం) తాకింది.



'అంతర్జాతీయ మార్కెట్లలో ఉన్న బుల్లిష్ ధోరణికి అనుగుణంగా దేశీయంగానూ బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయిల్లో ట్రేడయ్యాయి. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ ఈ ఏడాది చివరి నాటికి మరో రెండు రేట్ల కోతలు ఉంటాయంటూ సంకేతం ఇవ్వడం డాలర్, ట్రెజరీ ఈల్డ్స్ బలపడటాన్ని అడ్డుకుంది. ఇది పసిడి, వెండి ధరలకు మద్దతిచ్చింది' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. అంతర్జాతీయంగా చూస్తే బంగారం ధర 50 డాలర్లకు పైగా పెరిగి 3,760 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యింది. ఈ ఏడాది ఇప్పటి దాకా దేశీ మార్కెట్లో పసిడి ధరలు 47%, వెండి ధరలు 52% పెరగడం గమనార్హం.

అక్టోబర్ 21న మూరత్ ట్రేడింగ్

ముంబై: దీపావళి సందర్భంగా స్టాక్ ఎక్స్ఛేంజీలు అక్టోబర్ 21న గంట పాటు ప్రత్యేక 'మూరత్ ట్రేడింగ్' నిర్వహించనున్నాయి. మధ్యాహ్నం 1.45 గంటలకు మొదలై 2.45 గంటలకు ట్రేడింగ్ ముగుస్తుందని ఎన్ఎస్ఈ, బీఎస్ఈ తెలిపాయి.



ఈ దీపావళి నుంచి సంవత్ 2082 ఆరంభం కానుంది. ఈ పర్వదినం రోజు ట్రేడింగ్ చేస్తే.. వచ్చే దీపావళి వరకు లాభాలు వరిస్తాయనే నమ్మకంతో చాలా మంది మూరత్ ట్రేడింగ్‌లో పాల్గొనేందుకు ఆసక్తి చూపుతుంటారు. గతేడాది(2024) ప్రత్యేక మూరత్ ట్రేడింగ్ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు నిర్వహించాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
యూఎస్‌కు స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు డీలా | మార్కెట్‌కు హెచ్-1బీ ఫీజు పెంపు సెగ..

స్టాక్ మార్కెట్లే ఇప్పుడు దిక్కు

అమెరికా నుంచి ప్రతికూలతలు ఎదురవుతున్నా... విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు అమ్మకాలు కొనసాగిస్తున్నా... భారత మార్కెట్లు అంతకంతకూ పెరుగుతుండటానికి కారణం దేశీ ఇన్వెస్టర్లకు మార్కెట్లపై ఉన్న నమ్మకమేనని, కొన్నేళ్లుగా వారు కళ్లజూస్తున్న లాభాలే వారిని ఇన్వెస్ట్‌మెంట్‌కు ప్రేరేపిస్తున్నాయని ఎడిల్‌వీజ్ ఏఎంసీ ఎండీ- సీఈఓ రాధికా గుప్తా అభిప్రాయపడ్డారు. వినూత్న ఉత్పత్తులతో ఎడిల్‌వీజ్‌ను దేశవ్యాప్తంగా విస్తరించి... దేశంలోని అగ్రశ్రేణి మ్యూచువల్‌ఫండ్ కంపెనీల్లో ఒకటిగా మార్చిన రాధికా గుప్తా... నిరంజన్ అవస్థితో కలిసి 'మ్యాంగో మిలియనీర్' అనే పర్సనల్ ఫైనాన్స్ పుస్తకాన్ని రాశారు. దానికి సంబంధించిన కార్యక్రమంలో పాల్గొంటూ 'సాక్షి' ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. వచ్చే ఐదేళ్లలో ఎంఎఫ్ పరిశ్రమ 200 లక్షల కోట్లకు చేరుతుందంటున్న రాధికాతో 'సాక్షి' ఇంటర్వ్యూ ఇది...

'సాక్షి'తో ఎడిల్‌వీజ్ ఎండీ-సీఈఓ రాధికా గుప్తా

- ప్రత్యామ్నాయ పెట్టుబడి మార్గాలేవీ ఆకర్షణీయంగా లేవు
- అందుకే యువత సహా ఇన్వెస్టర్లంతా ఇటు చూస్తున్నారు
- అంతర్జాతీయ ప్రతికూలతలున్నా పెరుగుతున్నది అందుకే...
- గడిచిన కొన్నేళ్లుగా వచ్చిన లాభాలు మార్కెట్లపై నమ్మకం పెంచాయి
- కొన్ని షేర్లలో బబుల్స్ ఉండొచ్చు.. కానీ పునాదులు బలంగా ఉన్నాయి
- లిస్టింగ్ లాభాల కోసం తాడూబొంగరం లేని అన్‌లిస్టెడ్ కంపెనీల్లో పెట్టొద్దు
- దేశ వృద్ధిలో అన్ని రంగాలూ కీలకం.. అందుకే మ్యూచువల్ ఫండ్లు బెటర్
- తక్కువైనా... స్థిరమైన రాబడులతోనే సంపద సృష్టి సాధ్యం



(సాక్షి, ప్రత్యేక ప్రతినిధి)

అంతర్జాతీయంగా ఇబ్బందులెదురవుతున్నా భారత మార్కెట్లు కొత్త శిఖరాలను చేరుకోవటానికి కారణం?

యువత ఆకాంక్షలు పెరుగుతున్నాయి. మరోవంక ఇన్వెస్ట్‌మెంట్‌కు మరీ ఎక్కువ ప్రత్యామ్నాయాలేవీ లేవు. ఎందుకంటే బ్యాంకు డిపాజిట్లు చేశారనుకుందాం. పన్నులు పోతే మిగిలేది తక్కువే. పెరుగుతున్న జీవన ప్రమాణాలకిది సరిపోదు. అందుకని సహజంగానే జనం ఈక్విటీ మార్కెట్ల వైపు చూస్తున్నారు. నేను ఎంఎఫ్ పరిశ్రమలో అడుగుపెట్టినపుడు 'సిప్' ద్వారా వచ్చే మొత్తం 4 వేల కోట్లుగా ఉండేది. ఇపుడది 28వేల కోట్లకు చేరింది. ఇందులో అత్యధిక భాగం దీర్ఘకాలికం. అదే ఇక్కడ కీలకం. ప్రత్యేకించి గడిచిన రెండేళ్లుగా మార్కెట్లోకి వస్తున్న కొత్త ఇన్వెస్టర్లకు మంచి లాభాలొస్తున్నాయి.

అయితే ఈ ర్యాలీ చల్లారిపోయేది కాదని, బుడగలేవీ లేవని అంటున్నారా?

స్మాల్‌క్యాప్ కంపెనీలు... కొన్ని థీమ్స్..., కొన్ని కంపెనీల రూపంలో ఈ బబుల్స్ ఉండొచ్చు. పాలపై నురుగు ఓ 20 శాతం తప్పదు. ఏ బుల్ ర్యాలీకైనా ఇది వర్తిస్తుంది. దానర్థం మొత్తం మార్కెట్ ఇలానే ఉందని కాదుకదా? పునాదులు గట్టిగా ఉన్నాయన్నదే నా పాయింట్.

మరి ఇలాంటి సమయంలో రిటైల్ ఇన్వెస్టర్లకు మీరేం చెబుతారు?

అన్నిటికన్నా ముఖ్యం... అతిగా ఆశించకపోవటం. నా పుస్తకంలో కూడా అదే చెప్పాను. చాలామంది ఇన్వెస్టర్లు గత సంవత్సరాన్ని బేరీజు వేసుకుంటూ 30-40 శాతం రాబడి వస్తుందనే అంచనాలతో ఉన్నారు. అది సరికాదు. రెండోది... హైబ్రిడ్ ఫండ్లు, మల్టీ అసెట్ ఫండ్లు, ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ల వంటి మధ్యస్త ఆదాయాన్నిచ్చే ఉత్పత్తులను ఎంచుకోండి. ఇవి మరీ సంప్రదాయకంగా కాకుండా... మరీ దూకుడుగా కాకుండా మధ్యస్తంగా ఇన్వెస్ట్‌చేస్తాయి. స్థిరంగా నిలకడైన రాబడులనిస్తాయి. సంపద సృష్టించాలంటే అలానే సాధ్యం.

డిఫెన్స్ థీమ్, ప్రభుత్వ బ్యాంకుల థీమ్ అంటూ రకరకాల స్టోరీలను ఈ మధ్య చూస్తున్నాం. చాలామంది రిటైల్ ఇన్వెస్టర్లు వీటిని నమ్ముతున్నారు కదా?

నిజమే!. రిటైలర్లు ఇలాంటి స్టోరీల వెంటనే పరిగెడతారు. చివరకు దురదృష్టకరంగా ఎగ్జిట్ అవుతారు. నేనైతే ఈ థీమ్‌లను నమ్మను. ఏ ఒక్క రంగం వల్లనో దేశం ముందుకెళ్లదు. హోటల్స్, హాస్పిటల్స్, డేటా సెంటర్స్, క్యాపిటల్ మార్కెట్స్, టెక్నాలజీ.. ఇలాంటి రంగాలన్నీ దేశాభివృద్ధితో ముడిపడి ముందుకెళతాయి.

కానీ కొన్ని కంపెనీలు ఏడాదిలో 50 శాతం... రెండు మూడు రెట్లు పెరగటం చూస్తున్నారు కదా? ఇవి రిటైలర్లను ఆకర్షిస్తాయి కదా?

ఇలా పెరిగిన రెండుమూడు గురించే అంతా చెబుతారు. కానీ కుదేలైన షేర్ల గురించి చెప్పరు. స్టాక్ మార్కెట్లో లాభాలు ఆర్జించిన వారిని తప్ప నష్టపోయిన వారి స్టోరీలు బయటకు రావు. ఇలా ఒక షేర్లో పెట్టి లాభపడ్డ వారు కూడా మిగిలిన షేర్లలో రాబడి గురించి చెప్పరు. ఆ షేర్‌ను ఎంచుకోవటం వెనక వారి శ్రమ, సమయం కూడా ఉంటాయి కదా?

> **యువత చాలామంది ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ చేస్తున్నారు. మీరేమంటారు?**
>
> అదో దుర్మార్గం. ఎఫ్ అండ్ ఓ అనేది సంస్థలు రిస్క్‌ను తగ్గించుకోవటానికి ఉపయోగించుకోవాల్సిన సాధనం. అంతేతప్ప అప్పులు తెచ్చి ట్రేడింగ్ చేసే యువత కోసం కాదు. విద్యార్థులు, చిన్నచిన్న వర్కర్లు, డ్రైవర్లు రుణాలు తీసుకుని ట్రేడింగ్ చేస్తున్న వ్యవహారాన్ని నేనూ విన్నా. ఇది గ్యాంబ్లింగ్. ప్రమాదకరం. రిటైల్ ఇన్వెస్టర్లు సిప్, మ్యూచువల్ ఫండ్ల ద్వారా తేలిగ్గా సంపద సృష్టించుకోవచ్చు. గ్యాంబ్లింగ్ అవసరం లేదు.

మార్కెట్లో ఏ ఒక్క రంగమైనా మరీ అతిగా పెరిగినట్లు భావిస్తున్నారా?

అలాగని చెప్పలేం. అయితే కొన్ని అన్‌లిస్టెడ్ కంపెనీలు, ఎస్ఎంఈ ఐపీవోల విషయంలో మాత్రం ఆందోళన ఉంది. లిస్టింగ్‌లోనే లాభాలొస్తాయి కదా అని చాలామంది రిటైల్ ఇన్వెస్టర్లు కంపెనీ పూర్వాపరాలేవీ పట్టించుకోకుండా అన్‌లిస్టెడ్ కంపెనీల్లో పెట్టుబడులు పెడుతున్నారు. పేరు చెప్పలేను కానీ... ఈ మధ్య ఒక ఐపీవోలో దెబ్బతిన్నారు. కొన్ని ఎస్ఎంఈ కంపెనీలూ అంతే. వీటిలో పెద్ద లిక్విడిటీ ఉండదు. పరిస్థితులు అనుకూలించకపోతే ఇరుక్కుపోయే ప్రమాదమే ఎక్కువ. అందుకే నేనెప్పుడూ రిటైల్ ఇన్వెస్టర్లను ఇండెక్స్ ఫండ్లలో గానీ, ఏవైనా ఇతర మ్యూచువల్ ఫండ్లలో గానీ పెట్టుబడి పెట్టమని చెబుతాను.

ఏడాదికి 10-12 శాతం రాబడినిచ్చే మ్యూచువల్ ఫండ్లు బోరింగ్‌గా అనిపించవచ్చు. కానీ ఆ రాబడి స్థిరంగా ఉంటుంది. సురక్షితం కూడా.

చిన్న పట్టణాల్లో ఇన్వెస్ట్‌మెంట్ సంస్కృతి పెరుగుతోందా?

చాలా. ఎడిల్‌వీజ్‌ను 5 నగరాల్లో ఆరంభించాం. ఇపుడు 60 పట్టణాల్లో ఉన్నాం. త్వరలో 200 పట్టణాలకు విస్తరిస్తాం. స్థానిక భాషల్లో ఆర్థిక పాఠాల లభ్యత.. వారికి సలహాదారులు, డిస్ట్రిబ్యూటర్లు అందుబాటులో ఉండటమన్నదే ప్రధానం.

పాసివ్ (ఇండెక్స్) ఫండ్లకు ఆదరణ పెరుగుతోంది కదా.. మరి యాక్టివ్ ఫండ్లకు వీటితో పోటీ ఉంటుందా?

అలాంటిదేమీ లేదు. చాలామంది ఇన్వెస్టర్లు రెండింట్లోనూ పెట్టుబడి పెడుతున్నారు. బాగా రాబడులనిచ్చిన యాక్టివ్ ఫండ్లలోకి పెట్టుబడులొస్తాయి. లేదంటే పాసివ్ ఫండ్లలోకి వెళతాయి. రెండూ పెరుగుతున్నాయనేది మనం గమనించాలి.

> **భారత్ బాండ్ ఫండ్ మాదిరి ఎడిల్‌వీజ్ నుంచి కొత్త ఉత్పత్తులేమైనా వస్తున్నాయా?**
>
> అక్టోబర్ 1న మేం దేశంలో మొట్టమొదటి హైబ్రిడ్ స్పెషల్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్‌ను (ఎస్ఐఎఫ్) ఆరంభించబోతున్నాం. సెబీ ఇటీవలే దీనికి అనుమతిచ్చింది. దీన్లో కనీస పెట్టుబడి సైజు రూ.10 లక్షలు. దీన్లో రిస్క్ తక్కువ ఉంటుంది. ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల్ని బ్యాలెన్స్ చేసుకోవటానికి ఈ ఫండ్ ఉపయోగపడుతుంది.

ఇపుడు చాలామంది ఇన్వెస్టర్లు అమెరికా సహా అంతర్జాతీయ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేయాలని చూస్తున్నారు. ఎడిల్‌వీజ్ ప్రణాళికలేంటి?

టెక్నాలజీ, చైనా సహా కొన్ని గ్లోబల్ ఫండ్లను మేం నడిపిస్తున్నాం. కాకుంటే వీటికి ఆర్‌బీఐ పరిమితులున్నాయి. వీటిని గిఫ్ట్ సిటీ ద్వారా అధిగమించే ప్రయత్నం చేస్తున్నాం. ఇప్పటికే గిఫ్ట్‌సిటీలో కార్యాలయాన్ని ఆరంభించాం.

ఐదు పదేళ్లలో ఎంఎఫ్ పరిశ్రమ ఎలా ఉండొచ్చు?

2030 నాటికి ఇది 200 లక్షల కోట్లకు చేరుతుందన్నది నా అంచనా. దీన్లో 130-140 లక్షల కోట్లు ఈక్విటీలోనే ఉంటాయి. సిప్ పెట్టుబడులు నెలకు రూ. లక్ష కోట్లను చేరుతాయి. దేశంలో 30-40 శాతం మంది మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేయటమే వికసిత భారత్‌కు అర్థమన్నది నా భావన.

> **రిటైలర్లు తరచూ చేసే తప్పులేంటి?**
>
> అతిగా ఆశ పడటం, స్నేహితుల్ని కాపీ కొట్టడం, సోషల్ మీడియా టిప్స్ తీసుకోవటం, ఇన్వెస్ట్‌మెంట్ బదులు ట్రేడింగ్ చెయ్యటం, డైవర్సిఫికేషన్ లేకపోవటం ఇలా చాలానే ఉన్నాయి. నా పుస్తకంలో ఒక చాప్టర్ మొత్తం ఇదే రాశాను. ఇక సోషల్ మీడియా విషయానికొస్తే బాధ్యతాయుతంగా వాడితే అదో గొప్ప సాధనం. కాకపోతే ఆర్థిక సలహా అనేది చాలా సీరియస్ వ్యవహారం. తప్పుడు సలహాల్ని నమ్మితే కష్టపడి సంపాదించిన డబ్బు పోతుంది. చాలామంది ఇన్‌ఫ్లుయెన్సర్లు ఇన్వెస్టర్ల ప్రయోజనాల కోసం కాకుండా లైక్‌ల కోసం సలహాలిస్తుంటారు. తెలియని విషయాన్ని చెప్పొద్దన్నది నా సలహా. అర్హులైన నిపుణుల నుంచే సలహాలు తీసుకోవాలి.

సాక్షి స్పోర్ట్స్



భారత్‌కు రానున్న అథ్లెటిక్స్ దిగ్గజం ఉసేన్ బోల్ట్

అథ్లెటిక్స్ దిగ్గజం ఉసేన్ బోల్ట్ రెండోసారి భారత్‌కు రానున్నాడు. బెంగళూరు ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ), ముంబై సిటీ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్ల మధ్య అక్టోబర్ 1న ముంబైలో జరిగే ఎగ్జిబిషన్ ఫుట్‌బాల్ మ్యాచ్‌లో బోల్ట్ బరిలోకి దిగుతాడు. తొలి అర్ధభాగం బెంగళూరు జట్టుకు, రెండో అర్ధభాగంలో ముంబై జట్టుకు బోల్ట్ ప్రాతినిధ్యం వహిస్తాడు. భారత ఫుట్‌బాలర్లతోపాటు, బాలీవుడ్ ఇతర రంగాల ప్రముఖులు ఈ మ్యాచ్‌లో బోల్ట్‌తో కలిసి సరదాగా ఆడతారు. ప్రముఖ స్పోర్ట్స్ మా తయారీ సంస్థ ప్యూమా ఈ మ్యాచ్‌ను ఏర్పాటు చేస్తోంది. ఈ మ్యాచ్‌కంటే ముందు బోల్ట్ సెప్టెంబర్ 26 నుంచి 28 వరకు ఢిల్లీ, ముంబైలలో పలు ప్రైవేట్ ఈవెంట్లలో పాల్గొంటాడు. 'భారత్‌కు మరోసారి రావడానికి ఉత్సాహంతో ఉన్నాను. క్రీడల పట్ల ఇక్కడి ప్రజలకు ఎంతో మక్కువ ఉంది. భారీ సంఖ్యలో నన్ను అభిమానించే వాళ్లు కూడా ఉన్నారు' అని 2014లో తొలిసారి భారత్‌కు వచ్చిన 39 ఏళ్ల బోల్ట్ వ్యాఖ్యానించాడు. 2017లో అథ్లెటిక్స్‌కు గుడ్‌బై చెప్పిన బోల్ట్ ఒలింపిక్స్‌లో 8 స్వర్ణాలు, ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 11 స్వర్ణాలు, 2 రజతాలు, ఒక కాంస్యం సాధించాడు.

దివ్య దేశ్‌ముఖ్‌కు వైల్డ్ కార్డు

పురుషుల ప్రపంచకప్ టోర్నీ బరిలో భారత మహిళా గ్రాండ్‌మాస్టర్



న్యూఢిల్లీ: భారత మహిళా గ్రాండ్‌మాస్టర్, మహిళల చెస్ ప్రపంచకప్ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్ ఈ ఏడాది మరోసారి పురుషుల ఈవెంట్‌లో పాల్గొనేందుకు సిద్ధమైంది. ఇటీవలే గ్రాండ్ స్విస్ టోర్నీలో పురుష గ్రాండ్‌మాస్టర్లతో పోటీపడ్డ దివ్య... అక్టోబర్ 31 నుంచి నవంబర్ 27 వరకు భారత్‌లోని గోవా వేదికగా జరిగే పురుషుల ప్రపంచకప్ టోర్నీలో **బరిలోకి దిగనుంది. వాస్తవానికి దివ్యకు ఈ టోర్నీలో పాల్గొనే అవకాశం లేకపోయినా...** చివరి నిమిషంలో **ఒక ప్లేయర్ వైదొలగడంతో** ఆ స్థానాన్ని **దివ్య దేశ్‌ముఖ్‌తో భర్తీ చేశారు. ఈ** టోర్నీలో **ఆడాలని మహిళల ప్రపంచ నంబర్‌వన్** హు ఇఫాన్ **(చైనా), ప్రస్తుత ప్రపంచ చాంపియన్** జు **వెన్‌జున్ (చైనా)లకు నిర్వాహకులు** ఆహ్వానించారు. **అయితే ఈ ఇద్దరు చైనా గ్రాండ్** మాస్టర్లు **ప్రపంచకప్‌లో ఆడేందుకు రాలేమని** తెలిపారు. **నాకౌట్ ఫార్మాట్‌లో జరిగే ప్రపంచకప్‌లో మొత్తం 206 మంది ప్లేయర్లు పోటీపడతారు.** టాప్-3లో నిలిచిన వారు వచ్చే ఏడాది జరిగే క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధిస్తారు. భారత్ నుంచి ఈ టోర్నీలో 20 మంది ప్లేయర్లు ఆడనున్నారు. ప్రస్తుత ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్, ఇరిగేశి అర్జున్, ప్రజ్ఞానంద, విదిత్, అరవింద్ చిదంబరం, పెంటేల హరికృష్ణ, నిహాల్ సరీన్, మురళీ కార్తికేయన్, ప్రాణేశ్, ఇనియన్, ఎస్ఎల్ నారాయణన్, దీప్తాయన్ ఘోష్, సూర్యశేఖర గంగూలీ, కార్తీక్ వెంకటరామన్, రాజా రిత్విక్, ఆరోన్యక్ ఘోష్, లలిత్ బాబు, హిమల్ గుసెయిన్, హర్షవర్ధన్, నీలాశ్ సాహా పోటీపడనున్నారు.

ఫుట్‌బాల్‌లోనూ పాక్‌పై భారత్‌దే పైచేయి

కొలంబో: ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీలో పాకిస్తాన్ జట్టును భారత జట్టు చిత్తుచేయగా... మరోవైపు ఫుట్‌బాల్‌లోనూ పాకిస్తాన్ జట్టుపై భారత్ తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్-17 టోర్నమెంట్‌లో భాగంగా పాకిస్తాన్‌తో సోమవార జరిగిన గ్రూప్ 'బి' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 3-2 గోల్స్ తేడాతో గెలిచింది. భారత్ తరఫున దలాల్‌మువాన్ గాంగ్టే (31వ నిమిషంలో), గున్లేబా వాంగ్‌ఖెరాక్‌పమ్ (64వ నిమిషంలో), రహాన్ అహ్మద్ (74వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. పాకిస్తాన్ జట్టుకు హంజా యాసిర్ (71వ నిమిషంలో), మొహమ్మద్ అబ్దుల్లా (43వ నిమిషంలో) ఒక్కో గోల్ అందించారు. ఈ విజయంతో భారత్ గ్రూప్ 'బి'లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి తొమ్మిది పాయింట్లతో టాపర్‌గా నిలిచింది. ఆరు పాయింట్లతో పాకిస్తాన్ రెండో స్థానాన్ని దక్కించుకుంది. గ్రూప్ 'బి' నుంచి



భారత్, పాకిస్తాన్ జట్లు సెమీఫైనల్ చేరుకున్నాయి. గ్రూప్ 'ఎ' నుంచి బంగ్లాదేశ్, నేపాల్ జట్లు సెమీఫైనల్లోకి ప్రవేశించాయి. ఈనెల 25న జరిగే సెమీఫైనల్స్‌లో బంగ్లాదేశ్‌తో పాకిస్తాన్; నేపాల్‌తో భారత్ తలపడతాయి.

'సమఉజ్జీల సమరం' ఏమాత్రం కాదు!

- పాక్‌తో 'వైరం' అనడంలో అర్థం లేదు
- సూర్యకుమార్ యాదవ్ వ్యాఖ్య

దుబాయ్: 'ఇద్దరు కొట్టుకుంటే యుద్ధం...అదే ఒకడు మీద పడిపోతే దండయాత్ర'... తెలుగు సినిమాలో ఒక డైలాగ్ ఇది. భారత టి20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సరిగ్గా ఇదే అర్థం వచ్చేలా పాకిస్తాన్ గురించి చెప్పాడు. భారత్, పాక్ మధ్య మ్యాచ్ అంటే ఇప్పుడు పూర్తిగా ఏకపక్షమని అతను గుర్తు చేశాడు. అసలు ఇరు జట్ల మధ్య ఆటను 'వైరం'తో పోల్చాల్సిన అవసరమే లేదని అతను స్పష్టం చేశాడు. భారత్, పాక్ మధ్య 2018 నుంచి జరిగిన గత 7 వన్డేల్లో భారత్ 6 గెలవగా, 1 మ్యాచ్ వర్షంతో రద్దయింది. ఇరు జట్ల మధ్య మొత్తం 15 టి20 మ్యాచ్‌లు జరగ్గా... భారత్ 11 గెలిచి, 3 మాత్రమే ఓడింది. వరుసగా గత 4 మ్యాచ్‌లలో మనదే పైచేయి. 2022లో ఓటమి తర్వాత రెండు ఫార్మాట్‌లు కలిపి మన జట్టు వరుసగా 7 మ్యాచ్‌లలో విజయం సాధించింది. ఈ నేపథ్యంలో టీమిండియా ఆధిపత్యంపై సూర్య తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. 'భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్‌లకు 'వైరం' అనే మాటను ఇకపై వాడవద్దని విజ్ఞప్తి చేస్తున్నా. అసలు ఇరు జట్ల మధ్య వైరం అనాల్సినంతగా పోటీ ఎక్కడ ఉంది. నా అభిప్రాయం ప్రకారం రెండు జట్ల మధ్య 15-20 మ్యాచ్‌లు జరిగి ఇద్దరూ 7-7తో సమంగా ఉండి లేదా 8-7తో కాస్త ఆధిక్యంలో ఉంటే సమ ఉజ్జీల సమరం అని చెప్పవచ్చు. కానీ సరిగ్గా అంకెలు గుర్తు లేవు కానీ ప్రస్తుతం ఇది 13-0 లేదా 10-1గా ఉంది. కాబట్టి ఇకపై ఇది అసలు పోటీనే కాదు' అని సూర్య ఘాటుగా వ్యాఖ్యానించాడు.

దూబే స్పెల్ కీలక మలుపు...

పాక్ ఇన్నింగ్స్ డ్రింక్స్ విరామ సమయంలో ఆట మలుపు తిరిగిందని సూర్యకుమార్ అన్నాడు. సాధారణంగా పవర్‌ప్లే తర్వాత ఆట మారుతుందని, కానీ 10-17 ఓవర్ల మధ్య తాము పాక్‌ను కట్టడి చేయడంలో సఫలమయ్యామని కెప్టెన్ చెప్పాడు. ఈ 8 ఓవర్లలో పాక్ 38 పరుగులు మాత్రమే చేయగలిగింది. 'స్పిన్నర్లు బాగానే బౌలింగ్ చేసినా నా దృష్టిలో శివమ్ దూబే స్పెల్ ఆటను మలుపు తిప్పింది. ఈసారి అతను తనకు లభించిన అవకాశాన్ని సమర్థంగా వాడుకుంటూ పూర్తి కోటా ఓవర్లు బౌలింగ్ చేశాడు. ప్రాక్టీస్ సెషన్లలో దూబే బౌలింగ్‌లో బాగా శ్రమించాడు. కొత్త



బంతితో కూడా సాధన చేశాడు. ఈ మ్యాచ్‌లో పక్కా ప్రణాళికతో అతను వచ్చాడు' అని సూర్య చెప్పాడు. మరోవైపు నీరు-నిప్పులాంటి గిల్, అభిషేక్ భాగస్వామ్యంపై కూడా సారథి ప్రశంసలు కురిపించాడు. 'అభిషేక్ బ్యాటింగ్ శైలి అలాగే ఉంటుంది. పవర్‌ప్లే తర్వాత కూడా అతను తగ్గడు. గిల్ ఎలా ఆడతాడో కూడా అందరికీ తెలుసు. ఏ రకంగానైనా అతను పరుగులు రాబట్టగలడు. మైదానం బయట కూడా మంచి స్నేహం ఉంటే ఫలితం ఎలా ఉంటుందో వీరిద్దరు చూపించారు. నీరు-నిప్పులాంటి వీరిద్దరు కలిసి ఆడుతుంటే సమన్వయానికి ఒక కనుసైగ చాలు' అని కెప్టెన్ వ్యాఖ్యానించాడు.

'వాళ్లు అలా చేయడం నచ్చలేదు'



భారత్, పాక్ మ్యాచ్‌లలో సహజంగా కనిపించే కవ్వింపులు, మాటల యుద్ధం ఆదివారం మ్యాచ్‌లో కూడా కనిపించింది. వేర్వేరు సందర్భాల్లో అభిషేక్ శర్మ, శుబ్‌మన్ గిల్‌లకు హారిస్ రవూఫ్, షాహిన్ అఫ్రిదిలతో వివాదం రేగింది. దీనిపై మ్యాచ్ తర్వాత అభిషేక్ స్పష్టతనిచ్చాడు. పాక్ ఆటగాళ్ల ప్రవర్తన వల్లే తాను స్పందించాల్సి వచ్చిందని అతను చెప్పాడు. 'ఎలాంటి కారణం లేకుండా వారు మాపైకి దూసుకొచ్చి కవ్వించే ప్రయత్నం చేశారు. అది నాకు అస్సలు నచ్చలేదు. నేను దూకుడుగా ఆడి చెలరేగడమే దానికి సరైన మందు అని భావించాను' అని అభిషేక్ వెల్లడించాడు. తన బాల్య మిత్రుడు గిల్‌తో కలిసి భారీ భాగస్వామ్యం నెలకొల్పడం, అది జట్టు విజయానికి కారణం కావడం పట్ల అభిషేక్ సంతోషం వ్యక్తం చేశాడు. మరోవైపు హాఫ్ సెంచరీ చేశాక తాను గన్ షూటింగ్ తరహాలో చేసిన సంబరంలో ఎలాంటి తప్పూ లేదని పాక్ బ్యాటర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ అన్నాడు. 'ఆ క్షణంలో వచ్చిన ఆలోచనతోనే నేను గన్ తరహాలో బ్యాట్‌తో అలా చేశాను. నేను సాధారణంగా 50 దాటినప్పుడు ఎలాంటి సంబరాలు చేసుకోను. అప్పటికప్పుడు నాకు అలా చేయాలనిపించింది. జనం దాని గురించి ఎలా ఆలోచిస్తారనేది నాకు అనవసరం. దానిని నేను పట్టించుకోను' అని ఫర్హాన్ స్పష్టం చేశాడు.



చావో రేవో మ్యాచ్

- నేడు పాకిస్తాన్‌తో శ్రీలంక ఢీ
- ఆసియా కప్ టి20 టోర్నీ

అబుదాబి: ఆసియా కప్ సూపర్-4 దశలో తమ తొలి మ్యాచ్‌ల్లో ఓడిన రెండు జట్లు కీలక సమరానికి సన్నద్ధమయ్యాయి. నేడు జరిగే పోరులో పాకిస్తాన్‌తో శ్రీలంక తలపడుతుంది. లీగ్ దశలో అజేయంగా నిలిచిన శ్రీలంక గత పోరులో అనూహ్యంగా బంగ్లాదేశ్ చేతిలో ఓడగా... భారత్ చేతిలో పాకిస్తాన్ చిత్తయింది. ఫైనల్ చేరే అవకాశాలు సజీవంగా ఉండాలంటే ఈ మ్యాచ్‌లో గెలవడం తప్పనిసరి. సూపర్-4లో రెండో పరాజయం ఎదురైతే ముందంజ వేసే అవకాశాలు దాదాపుగా ముగిసిపోతాయి. ఈ నేపథ్యంలో ఎవరు పైచేయి సాధిస్తారనేది ఆసక్తికరం. భారత్ చేతిలో ఓడిన మ్యాచ్‌లో ఆరంభంలో పాక్ బ్యాటింగ్ మెరుగ్గానే కనిపించింది. టాప్-3 బ్యాటర్లు ఫఖర్, ఫర్హాన్, అయూబ్ రాణించారు. అయితే జట్టు మిడిలార్డర్ మరీ పేలవంగా కనిపిస్తోంది. తలత్, నవాజ్, కెప్టెన్ సల్మాన్ ఏమాత్రం ప్రభావం చూపలేకపోతున్నారు. పాక్ బౌలింగ్ కూడా గొప్పగా లేదు. మరోవైపు శ్రీలంక కూడా బ్యాటింగ్ వైఫల్యం వల్లే బంగ్లా చేతిలో ఓటమిపాలైంది. అయితే లీగ్‌లో ఆటగాళ్ల ప్రదర్శనను బట్టి చూస్తే ఆ జట్టు కోలుకునే అవకాశం ఉంది. ప్రధాన బ్యాటర్లు కుశాల్ మెండిస్, కుశాల్ పెరీరా, నిసాంకపై అంచనాలు ఉండగా... బౌలింగ్‌లో చమీరా, హసరంగ రాణిస్తున్నారు. ఆల్‌రౌండర్‌గా షనక ప్రభావం చూపించాడు. ఇప్పటి వరకు ఆకట్టుకోని కెప్టెన్ అసలంక ఒక మంచి ఇన్నింగ్స్ ఆడాలని టీమ్ కోరుకుంటోంది.

మళ్లీ 'క్యాబ్' అధ్యక్షుడిగా గంగూలీ | విండీస్‌తో సిరీస్‌కు పంత్ దూరం
మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో